


**(గత సంచిక తరువాయి)**

**అంతా అతనివెంట నడిచారు.** అతను ఓ కటకటాల తలుపు తెరచుకుని, ఒంగి లోపలకి నడిస్తే అతని వెంట ఆ పాతికమంది నడిచారు. లోపల కటిక చీకటి. ఎగ్రికో చైత్ర చేతిని, చైత్ర చెల్లెలి చేతిని పట్టుకున్నారు. గైడ్ టార్చ్‌లైట్ వెలుగుని బట్టి అతన్ని అనుసరించారు. కుడివైపు తలుపుని చూపించి చెప్పాడు.

"ఇది కండెండ్ సెల్. తిరుగుబాటు చేసి లొంగని ఖైదీలని ఇందులో ఉంచి నీరు, ఆహారం ఇవ్వకుండా చంపేవారు. వరసగా మూడు తలుపులున్న ఈ సెల్‌లోంచి తప్పించుకోలేరు. లోపల రాతి గోడలమీద వారు బాధతో గీసిన గీతలు కనపడతాయి. వందలమంది ఇందులో మరణించారు."

కటకటాల తలుపులోంచి అతను టార్చ్‌లైట్ వేసి చూపించాడు. గోడలమీద గోళ్ళతో గీసిన గీతలు వారి బాధని తెలియచేసే లిపిలా ఆద్యకి తోచింది. కొద్దిదూరం వెళ్ళాక ఆగి బాకో కొనసాగించాడు.

లండన్ డంజన్ నమూనాని అనుసరించి దీన్ని నిర్మించారు. బానిసలని మనం నిలబడ్డ చోటే బంధించేవారు. దీన్ని బ్రిటీష్ వారు 'స్లేవ్ హోల్స్' అని పిలిచేవారు. ఒకో గదిలో రెండూ వందలమందిని కుక్కేవాళ్ళు. ఓసారి ఇందులో పదిహేను వందలమందిని బంధించగలిగేవారు. వారిలో వెయ్యిమంది మగాళ్ళు. ఐదువందలమంది ఆడవాళ్ళు. మగాళ్ళకన్నా ఆడవాళ్ళు బలహీనులు. వారి బదులు మగాళ్ళనే పంచచ్చుగా? మరి ఆడవాళ్ళని బానిసలుగా ఎందుకు పంపేవారో ఊహించగలరా?"

ఎవరూ జవాబు చెప్పలేదు.

"ఆడవాళ్ళు బిడ్డల్ని కంటే బానిసలు పెరుగుతారని. బానిసల యజమానులు కోళ్ళఫారాల్లా ఆఫ్రికన్ మానవఫారాలని నిర్వహించేవారు. పీటా సెకా అనే ఆఫ్రికన్ బానిస వివిధ మహిళలతో గడిపి రెండువందలమంది పిల్లలకి తండ్రయ్యాడు. అతను అందుకు ఎంతో మానసిక క్షోభని అనుభవించాడు. దయచేసి అంతా ఒకరికొకరు ఆనుకుని నిలబడండి.. నిలబడ్డారా? రెండువందల ఏళ్ళ క్రితం సరిగ్గా మీరు నిలబడ్డ చోటే బానిసలు రోజుల తరబడి ఇలా ఇరుక్కుని, మనిషిని మనిషి రాసుకుని నిలబడేవారు. కూర్చోలేరు. పడుకోలేరు. వారి శరీరాలు రిలాక్స్ కాలేవు. మలమూత్రాల విసర్జన, భోజనం ఇక్కడే. వీరిని తీసుకెళ్ళే ఓడ రెండునించి ఆర్నెల్లదాకా రాకపోతే నేలంతా మనిషి

మలమూత్రాలతో, వాంతులతో నిండి దుర్గంధం వేసేది. కింద చూడండి. మధ్యలోని ఆచార వారి మలం వల్ల ఏర్పడింది. అది బయటకి వెళ్ళడానికి ఇక్కడ చిన్న కాలువ ఉండేది. ఎల్లో ఫీవర్, మలేరియాలాంటి రోగాలు ఈ అశుభ్రప్రదేశంలో సర్వసాధారణం. ఇది బ్రిటీష్‌వారి రికార్డుల్లో లేదు. మరి ఎలా తెలుసు? ఘనా ఆర్కియాలజిస్ట్‌లు ఈ డంజన్‌లో తవ్వి మనిషి వెంట్రుకలు, ఎండిపోయిన వాంతి, మలమూత్రాలు, రక్తం చమట కనుగొన్నారు."

అలాంటి ఘోరం గురించి ఎన్నడూ వినని ఆద్యకి వణుకు పుట్టింది.

"వారి మనఃస్థితిని ఊహించండి. తమకేం జరుగుతోందో తెలీదు. ఎంతకాలం అలా నిలబడాలో తెలీదు. ఏంఅవుతారో తెలీదు. అసలు ఎందుకు తమనలా బంధించారో తెలీదు. ఆ గోప్యత వారిని అధికంగా బాధించి మానసికంగా బలహీనుల్ని చేసేది. ఈ డంజన్‌లోకి వచ్చిన ఎవరూ వెనక్కి మళ్ళలేరు. వారికి రెండే చలనాలు. ప్రాణాలతో ముందుకి నడిచి సొరంగం చివరకి చేరుకుని ఓడని ఎక్కడం. లేదా శవమై బయటకి విసర్జించబడటం. ఇక్కడ బంధించిన ఐదుగురిలో సగటున నలుగురు మరణించి, ఒకరు మాత్రమే ఓడని ఎక్కేవారు. మీరు వారే అని ఊహించుకుంటూ ఓ నిమిషం సేపు గోడకి మీ చేతులని, తలని ఆనించి మౌనంగా నిలబడండి" గైడ్ కంఠం వినిపించింది.

వెంటనే అతని టార్చ్‌లైట్ ఆరిపోయింది. ఆ నిమిషం సేపు ఆ చీకట్లో అంతా కదలకుండా మౌనంగా నిలబడ్డారు. ఆద్య వారిలా తను తన కుటుంబాన్నించి ఎత్తుకొచ్చిన బానిసగా ఊహించుకుంటూంటే భయంతో వణికిపోయింది. మళ్ళీ టార్చ్‌లైట్ వెలిగించి గైడ్ చెప్పాడు.

"ఇక్కడ ఎన్ని కన్నీళ్ళు కారుంటాయి? ఎన్ని ప్రార్ధనలు జరిగుంటాయి? ఈ నల్ల చర్మాల నరకంలోంచి బయటకి వెళ్దాం పదండి."

అతని వెంట బయటకి వస్తూంటే ఓ చోట సీలింగ్‌ని ఆనుకున్న రెండు చిన్న కిటికీలు కనిపించాయి. గైడ్ చెప్పాడు.

"అవి మాత్రమే తాజా గాలిని లోపలికి తెచ్చి, లోపలి గాలిని బయటకి పంపుతూ గాలిని, గుడ్డి వెలుతురుని సరఫరా చేసేవి ."

బయటి ద్వారం చివరలోంచి లోపలకి వచ్చే వెలుగు కనిపించింది. నిశ్శబ్దంగా దాంట్లోంచి బయటకి వచ్చిన చైత్ర, ఆద్య కళ్ళల్లో నీటిని ఎన్రికో చూసాడు. గైడ్ అందరివంకా చూసి లెక్కపెట్టినట్లు నటించి వేలిని పైకి చూపిస్తూ చెప్పాడు.

"గుడ్. మీర్లో ఎవరికీ గుండాగలేదు. పైకి వెళ్ళలేదు. ఆ ఊపిరాడని ప్రదేశం చూసారు. ఈ విశాలమైన, చల్లటి తాజా గాలి వీచే ప్రదేశాన్ని చూస్తున్నారు. సరిగ్గా ఈ డంజన్ పైన గవర్నర్ అపార్ట్‌మెంట్, అడ్మినిస్ట్రేషన్ గదులు, ఛాపెల్ ఉన్నాయి. ఈ రెండూ రెండు విభిన్న ప్రపంచాలు. కింద వీళ్ళంత బాధలని అనుభవిస్తూంటే, అది తెలిసిన బ్రిటీష్ వారు పైన ఎలా శాంతిగా జీవించేవారో? సాటి మనిషిని ఎక్స్‌ప్లాయిట్ చేసే చోటుకి కొన్ని అడుగుల దూరంలోనే ఛాపల్‌లో

వారు దైవప్రార్థన ఎలా చేయగలిగారో? వారి సెరమన్స్‌లో ఏం బోధించేవారు? గాస్పెల్‌లోని ఏ సందేశం చెప్పేవారో? అని నాకు అనిపిస్తూంటుంది. ఎందుకంటే జీసస్ బోధించింది ఇది కాదు. ఆనాటి వాళ్ళసలు మనుషులా, మృగాలా అని నాకు అనిపిస్తూంటుంది."

"వాళ్ళు మృగాలు" ఓ నల్లజాతి సందర్శకుడు కోపంగా చెప్పాడు.

అకస్మాత్తుగా ఆద్య వాంతి చేసుకుంది.

"ఆర్ యు ఓకే?" ఎన్రికో, బాకో ఒకేసారి అడిగారు.

"ఓకే. మానసికంగా అప్‌సెట్టయ్యానంతే" ఆద్య బలహీనంగా జవాబు చెప్పింది.

"నచ్చిన ఆడవారిని బ్రిటీష్ సైనికులు బలాత్కారం చేయడం సర్వసాధారణం. వారిలో వయసులోని ఆడపిల్లలకి సైనికులు స్నానాలు చేయించి గవర్నర్ దగ్గరకి తీసుకువెళ్ళేవారు. ఆయనకి నచ్చిన అదృష్టవంతులని ఉంచేసుకునేవాడు తప్ప ఓడలో పంపేవాడు కాదు. బలాత్కరించబడేవారు అదృష్టవంతులు. వారు గర్భవతులైతే ఊళ్ళో ఎవరింట్లోనైనా ఉంచి, ఆ పిల్లల్ని ఈ కేజిల్ బయట ఉన్న కేప్ కోస్ట్ స్కూలుకి పంపి చదువు చెప్పించి జాగ్రత్తగా చూసుకునేవాడు. నా ముత్తమ్మ అలా పంపబడినవారిలో ఒకరు."

ఆ డంజన్‌లోంచి వాళ్ళు వచ్చిన తలుపు పక్కనించి సముద్రపు ఒడ్డుకి వెళ్ళే సన్నటి దారి ఉంది. ఐతే గోడకి అడుగున్నర జాగా వదిలి ఇవతలివైపు బయటకి రాకుండా ఇనపగ్రిల్స్‌ని బారికేడ్‌గా కట్టిన దారది.

"ఓడ రాగానే కొన్ని వారాలపాటు చీకట్లో ఉన్న ఆ బానిసలు బయటకి ఈ దరిలోకి రాగానే కళ్ళు మిరుమిట్లు గొలిపి వెలుతురుకి  అలవాటు పడటానికి కొంత సమయం పట్టేది. 'నడు. నడు' అని గార్డులు వాళ్ళని బెత్తాలతో కొడుతూంటే, ఎదుటివారి భుజాలు పట్టుకుని ఎట్నించి చురుక్కుమనే దెబ్బ పడుతుందా అనే భయంతో వేగంగా ముందుకి నడిచేవారు."

బాకో వారిని దాదాపు వంద అడుగుల దూరంలోని ఆ మార్గం పూర్తయ్యే చోట ఓ గేట్ దగ్గరకి తీసుకెళ్ళి మౌనంగా గేట్ పైనున్న బోర్డ్‌ని చూపించాడు. ఆ చిన్న ఇనప తలుపుపైన అర్ధ చంద్రాకారంలోని ఆర్చ్‌కి తగ్గట్టుగా ఆ తలుపు కూడా పైన అర్ధచంద్రాకారంలో ఉంది. దాని పైభాగంలో ఇంగ్లీష్‌లో 'గేట్ ఆఫ్ నో రిటర్న్' అని రాసుంది.

"దీన్ని బ్రిటీష్ వారు రాసారు. ఇది వారు ఒప్పుకున్న సత్యం. ఈ కోట అవుటర్ వాల్‌కున్న ఈ గేట్‌లోంచి ఓసారి బయటకి వెళితే ఇక మళ్ళీ వెనక్కి ప్రాణాలతో ఈ గేట్‌లోంచి ఒక్కరు కూడా తిరిగి ఈ కోటలోకి రాలేదని ఆ బోర్డ్‌లో రాసిందానికి అర్థం"

అక్కడ పాలరాతి ఫలకం మీద ఎర్ర అక్షరాల్లో చెక్కింది చదివి చైత్ర ఫోటో తీసుకుంది.

ఇన్ ఎవర్ లాస్టింగ్ మెమోరీ

ఆఫ్ ది ఏంగ్విష్ ఆఫ్ అవర్ ఏన్సెస్టర్స్

మే దోజ్ హు డైడ్ రెస్ట్ ఇన్ పీస్

మే దోజ్ హు రిటర్న్ ఫైండ్ దైర్ రూట్స్

మే హ్యూమానిటీ నెవర్ అగైన్ పెర్‌పెట్రేట్ సచ్ ఇన్‌జస్టిస్ అగెనెస్ట్ హ్యూమానిటీ

వి, ది లివింగ్, ఓ టు అఫ్‌హోల్డ్ దిస్.

అతను గేట్ ఆఫ్ నో రిటర్న్ తలుపు తెరవగానే ఎదురుగా విశాలమైన సముద్రం కనిపించింది అంతా అతన్ని అనుసరించారు. బాకో చెప్పాడు.

"అది అట్లాంటిక్ మహాసముద్రం. అంతకాలం చీకట్లో కదిలే చోటులేక నిలబడ్డ బానిసలు ఒక్కసారిగా ఇంత విశాల సముద్రాన్ని చూసి భయంతో వణికిపోయేవారు. ఆ బానిసల భయంకరమైన ప్రయాణం ఈ తలుపు అవతల కొనసాగేది. అప్పట్లో నీరు తలుపుదకా వచ్చేదట. ఇప్పుడో ఇరవై అడుగులు వెనక్కి వెళ్ళింది. ఈ రేవులోనే ఆ దురదృష్టవంతులు ఓడని ఎక్కేవారు. ఆ ఓడ వారిని ప్రపంచంలోని సుదూర దేశానికి, న్యూ వరల్డ్‌కి తీసుకెళ్ళేది. ఆ సముద్రంలో ప్రయాణించే ఓడని ఎక్కలేక భయంతో నీళ్ళల్లోకి పరిగెత్తేవారు. వారికి ఓడలో ప్రయాణించే అలవాటు లేకపోవడంతో త్వరగా అనారోగ్యానికి గురయ్యేవారు. ఓడలోని పరిస్థితులు ఘోరంగా ఉండేవి. ఆహార పానీయాలు తీసుకోనివారిని కొట్టి బలవంతంగా తినిపించేవారు. తిరుగుబాటు చేసినవారిని క్రూరంగా శిక్షించేవారు. తక్కువ ప్రదేశంలో ఎక్కువమందిని రవాణా చేయడంతో వారంతా ఇరుక్కోవాల్సి వచ్చేది. వారుండే కింది అంతస్థులో శుభ్రత లేకపోవడంవల్ల చెత్తతో నిండి భరించలేని దుర్వాసన వేసేది. డయేరియా, మీజిల్స్, స్కర్వీలాంటి వ్యాధులు ప్రబలితే ఉప్పు, వెనిగర్‌తో కింది డెక్‌ని శుభ్రం చేయించేవారు. కొందరు బానిసత్వం కన్నా మరణం మేలనుకుని ఓడలోంచి నీళ్ళల్లోకి దూకి ఆత్మహత్యలు చేసుకున్నారు కూడా. దాంతో వ్యాధులు ప్రబలి మొత్తం నాలుగున్నర లక్షలమంది దారిలో మరణించారు."

కొద్ది నిమిషాలు అంతా మౌనంగా సముద్రంవంక చూస్తూండిపోయారు. ఊహాశక్తి గలవారు ఓ ప్రాచీన ఓడలోకి భయపడే నల్ల బానిసలని బలవంతంగా ఎక్కించే తుపాకులు, లాఠీలు ధరించిన ఎర్ర యూనిఫారాల్లోని తెల్ల సిపాయిలని ఊహించారు. వాళ్ళకా ఆలోచనలకి అవకాశం ఇచ్చాక బాకో అందరివంకా నాటకీయంగా చూసి అకస్మాత్తుగా అడిగాడు.

"ఇప్పుడు చెప్పండి. ఇందాక చేతులు ఎత్తినవారు ఇప్పుడు చెప్పండి. మీవి నిజంగా కష్టాలా? ఆ దంజన్‌లోని బానిసలు అనుభవించిన కస్త్రాలతో పోలిస్తే మీవి నిజంగా కష్టాలా?"

"నో" ఆద్య అప్రయత్నంగా చెప్పింది.

"మీ జీవితంలో మీకే కష్టం వచ్చినా సరే, ఆత్మీయుల మరణం కావచ్చు. ప్రేమించినవారు దూరమవడం కావచ్చు. మీ వ్యాపారభాగస్వామి మిమ్మల్ని మోసం చేయడం కావచ్చు. మీ కాలు విరిగి కొన్ని వారాలు వీల్ చెయిర్లో కూర్చోవడం

కావచ్చు. మీ కష్టాలని గుర్తు తెచ్చుకోండి. అప్పుడు మీ కష్టాలు దూదిపింజల్లా తేలిపోతాయి. ఎవరైనా తాము కష్టాల్లో ఉన్నామంటే వారికి ఈ డంజన్ గురించి చెప్పండి చాలు. మీ దేహం, మీది కాని స్వేచ్ఛారాహిత్యం, ఆకలి, దాహం, అనారోగ్యం, నిస్సహాయత, అయోమయం..." అతని కంఠం డగ్గుకత్తితో ఆగిపోయింది. తమాయించుకుని చెప్పాడు.

"సారీ. ప్రతీసారి ఈ మాటల దగ్గరే నేను నిస్సహాయుడ్ని అవుతాను. ఎమోషన్ అవుతాను. మా ముత్తాతలు ఎందరో ఇందులోంచి మానవ సరుకులా పంపబడ్డారు. వారు తమ గమ్యానికి  చేరారో లేక దారిలో మరణించారో నాకు తెలియదు. 'రూట్స్' రాసిన అలెక్స్ హేలీలా అందరూ తమ పూర్వీల గురించి తెలుసుకోగలిగే అదృష్టవంతులు కారు. గుడ్ న్యూస్. ఇక్కడికి వేలమైళ్ళ దూరంలోని బ్రిటన్ ట్రాన్స్ – అట్లాంటిక్ స్లేవ్ ట్రేడ్ చట్టవిరుద్ధమనే రూల్‌ని 1807లో తెచ్చింది. బ్రిటీష్ కరీబియన్‌నించి 6 లక్షలమంది బానిసలని విడుదల చేసారు. బ్రిటీష్ ప్రభుత్వం తోటి యజమానులకి రెండు కోట్ల పౌన్లు నష్టపరిహారంగా చెల్లించింది. కాని మాజీ బానిసలకి ఏదీ చెల్లించలేదు. కరీబియన్ ఐలాండ్స్‌లో బానిసలని విడుదల చేసే స్క్వాడ్రన్స్‌ని ఆరంభించి ఏడున్నర లక్షలమంది బానిసలకి స్వతంత్రాన్ని కల్పించారు. 1820 – 1870ల మధ్య రాయల్ నేవీ 1,500 ఓడలని స్వాధీనం చేసుకుని, వాటిలో రవాణాచేసే లక్షన్నరమంది బానిసలని కాపాడింది."

"హిస్టరీని ఇక వదిలేద్దామా?" ఒకరు విసుగ్గా చెప్పారు.

"హిస్టరీ మీకు విసుగ్గా ఉండచ్చు. కాని ఇది కన్నీటి హిస్టరీ. ఒకరి కన్నీరు మీకు విసుగా? ప్లీజ్ ప్రొసీడ్" చైనీస్ కోరాడు.

"అబ్రహాం లింకన్ వారిని బానిసత్వంలోంచి విడుదల చేయాలనుకోవడంతో అది అమెరికాలో సివిల్ వార్‌కి దారి తీసింది. ఆయన 1863లో ఎమానిసిపేషన్ చట్టాన్ని తెచ్చాడు. కాని టెక్సాస్‌లోని బానిసలకి ఈ చట్టం గురించి రెండేళ్ళదాకా తెలీక వారు బానిసలుగానే కొనసాగారు. అధికారికంగా బానిసత్వాన్ని నిర్మూలించిన ఆకరి దేశం బ్రెజిల్. 1888లో 1 డిసెంబర్ 1955 అమెరికాలోని నల్లవారికి చారిత్రాత్మక దినం. సరే. ఇక దీన్ని వదిలేద్దాం అటు చూడండి."

గైడ్ చూపించిన వైపు అంతా చూసారు. ఆ గేట్ ఆఫ్ నో రిటర్న్ బయట గేట్ ఆఫ్ రిటర్న్ అన్న పదాలు కనిపించాయి.

"ఈ గేట్లోంచి పంపబడ్డ బానిసల సంతతి చెందినవారు ఏ దేశం నించో వచ్చి ఈ కేజిల్‌ని చూసి ఫీలైనంతగా మీరు ఫీలవరు. కారణం వారిది వ్యక్తిగత బాధ. మీది సాధారణ మానవత్వపు బాధ. తమకి తెలీని తమ తాతలు, ముత్తాతలు, గ్రేట్ అంకుల్స్, గ్రేట్ ఆంట్స్ ఇక్కడ పడ్డ బాధని వాఇర్ వారసులు మీకన్నా ఇంకా గాఢంగా, తీవ్రంగా అనుభవిస్తారు. ఆగ్రహం చెందుతారు. ఆవేదన చెందుతారు. కాని ఏం చేయలేక ఆ బాధతో తిరిగి వెళ్ళిపోయినా దీన్ని వారు మీలా మరిచిపోలేరు. అవునా?" అతను అమెరికానించి వచ్చినవారిని అడిగాడు .

"ఎస్ ఈజ్ ది ఆన్సర్. ఎఫెర్‌మెటివ్" ఆ నల్లజాతి వ్యక్తి చెప్పాడు.

"తమ పూర్వీకుల అన్వేషణలో చాలామంది నల్లజాతివారు ఈ కేజిల్‌కి వచ్చారు. అలాంటి వారిలో ఒకరు హైతియన్  అమెరికన్. ఫ్లోరిడాలోని ఏ అండ్ ఎం యూనివర్సిటీ విద్యార్థి అయిన ఇరవై ఒక్కేళ్ళ దువాన్ స్టీవెన్ క్లార్క్ తన పూర్వీకుల అన్వేషణలో ఘానాకి జనవరి 2014లో వచ్చాడు. కాని తన పూర్వీకులు ఎవరో, వారి పేర్లేమిటో అతనికి ఎప్పటికీ తెలీదు. 'గేట్ ఆఫ్ నో రిటర్న్' అతన్ని బాగా బాధించింది. అతను అమెరికా తిరిగి వెళ్ళాక అక్కడి నల్లవారి రెండు ప్రాచీన సమాధులనించి ఎముకలని సేకరించి తెచ్చి, ఈ గేట్లోంచి కోట లోపలకు తీసుకెళ్ళాడు. దాంతో ఈ గేట్ పేరు 'గేట్ ఆఫ్ రిటర్న్'గా మారింది."

ఫ్రెంచ్ వారు వెంటనే చప్పట్లు కొట్టారు.

"ఈ ఏడాది 2019ని ఇటీవలే 'ది ఇయర్ ఆఫ్ రిటర్న్'గా జరిపారు. 'ట్రాన్స్ – అట్లాంటిక్ స్లేవ్ ట్రేడ్' 400వ ఏనివర్సరీకి బానిసల వారసులని ఈ ఫుల్ సర్కిల్ ఫెస్టివల్‌ని జరుపుకోడాని రమ్మని మా ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ సంవత్సరం ఘానాకి పది లక్షలమంది పర్యాటకులు వచ్చారు. వారిలో అధిక శాతం మంది అమెరికానించి వచ్చారు. జులై 2009లో అమెరికా తొలి నల్లజాతి అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇక్కడికి వచ్చాడు. నేనే అతని గైడ్‌గా వ్యవహరించాను. ఆయన ఇక్కడే నిలబడి కొద్దిసేపు కళ్ళుమూసుకున్నాడు. ఆయన ఆ సమయంలో ఏం ఆలోచించాడో నాకు తెలీదు. బహుశ ఆయన తన ఈస్ట్ ఆఫ్రికన్ కెన్యన్ పూర్వీకులు ఎవరైనా ఇక్కడనించే పంపబడ్డారా అని ఆలోచించి ఉండచ్చు.  వాళ్ళ ఆత్మశాంతికి ప్రార్థించి ఉండచ్చు. 'మనిషి అతి పెద్ద చెడ్డ పనిని చేసే సమర్థతని ఇది తెలియచేస్తోంది' అని కామెంట్ బుక్‌లో రాసాడు. ఘానాలోని మరికొన్ని ఇలాంటి కేజిల్స్‌తోపాటు యునెస్కో దీన్ని వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా ప్రకటించింది."

అక్కడనించి గేట్ ఆఫ్ రిటర్న్‌లోంచి వెనక్కి, కోటలో డంజన్ పైనున్న విశాలమైన గదిలోకి తీసుకెళ్ళి అడిగాడు.

"మీకు కేరమ్స్ ఆట నియమాలు తెలుసుగా?"

"తెలుసు."

"నల్లకాయిన్స్ విలువ పది. తెల్లకాయిన్స్ విలువ ఇరవై. వర్ణవివక్షత అక్కడినించే ఆరంభమైందని మా పూర్వీకులు చెప్పేవారు. ఈ గదిలోనే వర్తకులు గవర్నర్ పర్యవేక్షణలో బానిసల వేలం పాటలో పాల్గొనేవారు. వారి వయసు, శారీరక దారుఢ్యం, పళ్ళ ఆరోగ్యాన్ని చూసి కొనేవారు.  ఓ మనిషి ఇంకో మనిషికి ఏదీ ఉచితంగా ఇవ్వలేదు. డబ్బుకి తగ్గ విలువ రావాలి. లేదా కొద్దిగా తక్కువైనా సరే రావాలి. లేదా మంచి మానసిక భావనకోసం ఇస్తాడు. పుణ్యం, ఇతరుల ముందు పరపతి, హోదా ప్రదర్శన, సంబంధం బలపరుచుకోవడం, బాధపడేవాడిని చూస్తే కలిగిన దయవల్ల సహాయం చేస్తేకాని మనసులోని బాధ చల్లారకపోవడం.. ఇలాంటి ఎన్నో మానసిక భావనల గురించి నేను చెప్పింది. ఐదు వందలమందిని పెళ్ళికి భోజనానికి పిలిచాడు. ఉచితంగా భోజనాలు పెట్టాడు. పదిమంది పిలవనివాళ్ళు వచ్చి తిని వెళ్ళారని బిల్ చూసి విలవిల్లాడిపోతాడు. నిజానికి తిన్నవాళ్ళు పారేసిన ఆహారంకన్నా వారు తిన్నది తక్కువ. కాని వారినించి ఏం రాలేదు.

వస్తువుకాని, మానసిక సంతృప్తికాని ఏదీ. ఇది మానవ స్వభావం. అవునా?" చెవి దగ్గర చేతిని ఉంచుకుని ముందుకి వంగి అడిగాడు.

"ఎస్." అంతా గట్టిగా జవాబు చెప్పారు.

"తాము ఎందుకు పనిచేస్తున్నామో బానిసలకి తెలియదు. ఎంతకాలం అలా పని చెయ్యాలో తెలీదు. తమ యజమానులకి తమ పనిని ఉచితంగా ఇవ్వడం వారిని బాధించేది."

అతను విశాలమైన మెట్లమీద డంజన్ పై కప్పుమీది మూడో అంతస్థులోకి వారిని తీసుకెళ్ళాడు. విశాలమైన గది. దానికి మూడువైపులా కీటికీలు. డంజన్‌కి వ్యతిరేకమా అన్నట్లుగా అక్కడ ధారాళంగా వెలుతురు, గాలి వస్తున్నాయి.

"ఇది ఈ కోట అధికారి బ్రిటీష్ గవర్నర్ ఆఫీస్ గది. పక్కనే అతని క్వార్టర్స్, యూరోపియన్ లివింగ్ క్వార్టర్స్ కూడా ఉన్నాయి. ఈ గదిని ఆనాడు ఎలా ఉందో అలాగే ఉంచేసారు. ఇక్కడ కిటికీలోంచి ఆయన ఓడల రాకపోకలని గమనించేవాడు. ఇక్కడనించే వందలమైళ్ళ దూరం నించి ఎత్తుకొచ్చిన ఇంకా ప్రాణాలతో ఉన్న అభాగ్యులని నార్త్ అమెరికాకి, సౌత్ అమెరికాకి, కరీబియన్ ఐలండ్స్‌కి, వెస్ట్ ఇండీస్, యూరప్ మొదలైన చోట్లకి తరలించడాన్ని పర్యవేక్షించేవాడు. అలా ఆర్జించిన సొమ్ము బ్రిటీష్ ప్రభుత్వానికి చేరేది."

అక్కడనించి సైనికుల క్వార్టర్స్‌ని చూపించి తిరిగి ఫిరంగులు, మూడంతస్థుల భవంతి మధ్య ఉన్న విశాల ప్రదేశానికి వారిని తెచ్చాక గైడ్ చెప్పాడు. "ఆరుబయట కురిసిన వర్షం నీరు వృధాకాకుండా మనం నించున్న చోట తూముల్లోంచి కింద వాటర్ స్టోరేజ్ టేంక్‌ల్లోకి వెళ్ళేది. కేజిల్ అవసరాలకి ఆ నీటినే వాడేవారు. ఇది ఓ సమాధి" నేలమీది ఓ ఫలకాన్ని చూపించి చెప్పాడు.

"ఎవరిది?" దానిమీది ఎల్.ఈ.ఎల్ అనే ఇనీషియల్స్‌ని చదివిన ఎన్రికో అడిగాడు.

"ఇంత భయంకరమైన చోట ఓ ప్రేమకథ కూడా జరిగింది. బ్రిటీష్ గవర్నర్‌లలో ఒకరైన జార్జ్ మెక్లీన్ లండన్‌కి వెళ్ళినప్పుడు మిస్ లెటిటియా ఎలిజబెత్ లేండన్ పరిచయమైంది. ఆమె రాబర్ట్ బ్రౌనింగ్‌ని ప్రభావితంచేసిన కవయిత్రి. మెక్లీన్, లేండన్‌లమధ్య ప్రేమ అంకురించి పెళ్ళి చేసుకున్నారు. ఆమె అగస్ట్ 1838లో ముప్పై ఆరవఏట ఇక్కడికి వచ్చింది. అప్పటికే మెక్లీన్ ఓ నల్లజాతి రాజుగారి కూతురిని పెళ్ళి చేసుకున్నాడు. వారికి ఐదుగురు పిల్లలు కూడా. లేండన్ రాగానే తన భార్యని బయట కేంప్ కోస్ట్‌లోని ఓ ఇంటికి పంపాడు. లేండన్‌కి గుండె జబ్బు ఉండటంతో లండన్‌నించి చికిత్సగా ప్రుసిక్ ఏసిడ్‌ని తెచ్చుకుంది. రెండు నెలల తర్వాత 15 అక్టోబర్ 1838న ఆమె దాన్ని తాగి మరణించింది. అది హత్యని, ఆ నల్లజాతి స్త్రీ చేసిందని కొందరు, కాదు, బానిసల కష్టాలని చూసి భరించలేక ఆత్మహత్య చేసుకుందని కొందరు, తన భర్తకి ముందే ఇంకో స్త్రీద్వారా ఐదుగురు పిల్లలు పుట్టారని తెలిసి నిర్ఘాంతపోయి ఆత్మహత్య చేసుకుందని కొందరు పొరపాటున ప్రుసిక్ ఎక్కువ తాగి ప్రమాదవశాత్తు మరణించిందని కొందరు ఆ రోజుల్లో భావించారు. మరణ సమయంలో ఆమె భర్త

ఇక్కడలేదు. ఆనాటి సర్జన్ విలియం కోబాల్ట్ ఆమె దేహానికి పోస్ట్‌మార్టం చేయలేదు. ఆమెకి 'అన్‌హేపీ ఎల్.ఈ.ఎల్' అనే పేరు వచ్చింది. సమాధిమీది ఎల్.ఈ.ఎల్ ఆమె ఇనీషియల్స్. ఆమె జ్ఞాపకార్థం ఓ విగ్రహాన్ని నెలకొల్పాలని మిత్రులు సూచించినా మెక్లీన్ తిరస్కరించడం మాత్రం వాస్తవం."

"అది హత్య అయి ఉండచ్చు. ఆత్మహత్యే ఐతే నిష్ఫలంగా ఆ పనిచేసింది. లండన్ వెళ్ళిపోయి మరొకర్ని చేసుకునేది" సౌత్ ఆఫ్రికానించి వచ్చిన ఒకరు చెప్పారు.

వెంటనే ఆద్యకి అనిపించింది, తను ఆత్మహత్య చేసుకుని ఉంటే తన జీవితం కూడా నిష్ఫలమయ్యేదని.

"మానసికంగా బలహీనులే ఆత్మహత్య చేసుకునేది. మీకేదో గుర్తుకు వచ్చినట్లుంది 'ఫేస్ ఈజ్ ది ఇండెక్స్ ఆఫ్ మైండ్. అండి ది ఐ ఆర్ ది ఇన్‌ఫార్మర్స్" ఆద్యని అప్పుడప్పుడూ అతను నవ్వుతూ చూస్తూ చెప్పాడు.

ఆమె సిగ్గుపడింది.

"భావోద్వేగాలకన్నా మెదడు బలమైనదైతేనే వాటిని గెలవగలం. సరే. 1877దాకా ఈ కోట బ్రిటీష్ ప్రభుత్వ కార్యాలయంగా పనిచేసింది. 1920లో బ్రిటీష్ పబ్లిక్ వర్క్స్ శాఖ దీన్ని రెస్టోర్ చేసింది .1957లో ఘానాకి స్వతంత్రం ఇచ్చేదాకా ఇది బ్రిటీష్ వారి ఆధీనంలోనే ఉంది. ఇప్పుడిది ఘానా మ్యూజియమ్స్ అండ్ మాన్యుమెంట్స్ బోర్డ్ ఆధీనంలోకి వచ్చింది. నేడు ప్రపంచంలోని నలుమూలల్లో ఈ కేజిల్‌నించి ప్రాణాలతో వెళ్ళినవారి వారసులు నివశిస్తున్నారు. కాని వారిలో చాలామందికి తమ పూర్వీకులు అనుభవించిన ఇక్కడి నరకం గురించి తెలీదు."

మళ్ళీ అతను నడుస్తూ చెప్పాడు.

"కేప్ కాజిల్‌ని దర్శించిన కవులు దీనిమీద కవిత్వాలు రాసారు. కథకులు కథలు రాసారు. నవలా రచయితలు నవలలు రాసారు. మీలో ఎవరైనా క్వామే అలెగ్జాండర్ రాసిన 'ది డోర్ ఆఫ్ నో రిటర్న్' నవలని చదివారా? అందులో అప్పర్ క్వాంటా గ్రామం నించి ఎత్తుకురాబడ్డ పదకొండేళ్ళ కోఫీ ఆఫిన్ విషాద కథని చదవచ్చు. హోం కమింగ్ అనే మరో నవలని యు గ్రాఫీ రాసాడు. అందులో ఎత్తుకొచ్చిన ఐఫియాని ఇంగ్లీష్ గవర్నర్ పెళ్ళి చేసుకుంటాడు. ఆమె పై భాగంలో హాయిగా జీవిస్తూంటే, తర్వాత ఎత్తుకొచ్చిన ఆమె సవతి చెల్లెలు కింద డంజన్‌లో పడే బాధలు అక్కకి తెలిదు."

చైత్ర అతన్ని ఆ రెండు నవలల రచయితల పేర్లు అడిగి మొబైల్‌లో వాయిస్ రికార్డ్ చేసుకుంది. ఒకరు అడిగిన ప్రశ్నకి గైడ్ జవాబు చెప్పాడు.

"ఆఫ్రికాలోని చాలా దేశాలు యూరోపియన్ కాలనీలు. ఈక్వెటోరియల్ గినీ ఒక్కటే స్పేనిష్ కాలనీ. ఆఫ్రికాలోని ఎక్కువభాగం ఇంగ్లీష్ కాలనీలు."

"ఇంగ్లీష్ కాలనీలు మొత్తం ఎన్ని?" చైనీస్ అడిగాడు.

"ఘానా, నైజీరియా, జాంబియా, కెన్యా, యుగండా, మలావి, కేమరూన్, బోట్స్వానా, గాంబియా సియర్రాలియోన్, టాంజానియా, నమీబియా, మారిషస్, స్వాజీలేండ్, బురుండి, సీషెల్స్, లెసోతో, సూడాన్, సౌత్ సూడాన్ జింబాబ్వే, సౌత్ ఆఫ్రికా , ఇంగ్లీష్ కాలనీలు. ఆ దేశాల్లో ఇంగ్లీష్ మాట్లాడతారు .తర్వాతి స్థానం ఫ్రెంచ్ వారిది. ఐవరీ కోస్ట్, బుర్కినాపాసో, బెనిన్, మడగాస్కర్, టోగో, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ది కాంగో, మాలి, రువాండా, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, ఛాడ్, నైగర్, జిబోటీ, మొరాకో, కొమొరోస్, రిపబ్లిక్ ఆఫ్ ది కాంగో, అల్జీరియా, గబాన్, కేమరూన్, మారిటేనియా, సెనగల్ ఫ్రెంచ్ కాలనీలు. పోర్చుగీస్ కాలనీలు, అంగోలా, కేప్ వర్డే. మొజాంబిక్, సావొటోమే & ప్రిన్సిపే". అతను వేళ్ళతో లెక్కపెడుతూ గుర్తు తెచ్చుకుంటూ చెప్పాడు.

"థాంక్స్" చైనీస్ చెప్పాడు.

అతను అందరివంకా చూసి నవ్వుతూ చెప్పాడు.

"మీకు ఇదంతా వివరించడానికి అవకాశం ఇచ్చినందుకు థాంక్స్. దంజన్ మీద వేలం పాట గది పక్కనున్న ఛాపెల్‌లో సర్వీస్ జరుగుతోంది కాబట్టి దానికి తీసుకెళ్ళలేను. అక్కడ ఫస్ట్ ఫ్లోర్‌లో మ్యూజియం ఉంది. చూడటానికి ఓ అరగంట పైనే పడుతుంది. ఆనాటి బ్రిటీష్ రాణి ఎలిజబెత్ వారి సమ్మతి లేకుండా ఏ మనిషినీ బానిసల్లా బంధించడం కూడదని, అది అసహ్యకరమైన చర్యని, ఆ పనిచేసినవారిమీద దేవుడు పగ తీర్చుకుంటాడని నమ్మింది. ఆవిడ నల్ల బానిసల వ్యాపారాన్ని రద్దు చేసుంటే కొన్ని వేలమంది కాపాడబడేవారు. కాని ఖజానాకి వచ్చే సొమ్ముని చూసి ఆ రాణీ తన రెండు ఓడలని జాన్ హాకిన్స్ అనే వ్యాపారస్థుడికి బానిసల రవాణాకి ఇచ్చింది. అలా మొదటి నల్లబానిసలని వెస్ట్ ఆఫ్రికానించి నార్త్, సౌత్ అమెరికాలకి రవాణా చేసారు. అధికారంలోని వారు తీసుకునే ఓ నిర్ణయం ప్రజలకి మంచి లేదా చెడు చేస్తూండటం మనం ఈరోజుకీ చూస్తున్నాం. జమైకా, వెస్టిండీస్, కరీబియన్ ద్వీపాల్లాంటి బ్రిటీష్ కాలనీల్లో మొక్కజొన్న, పొగాకు, పత్తి, కాఫీ, చెరకు తోటలు ఉండేవి. వాటిలో పనిచేయడానికి పదిహేడో శతాబ్దంలో బానిసలని దిగుమతి చేసుకోసాగారు. ఆదాయంకోసం తోటలు అభివృద్ధి చేసారు. దాంతో కూలీల అవసరం పెరిగి బానిస వ్యాపారం ఊపందుకుంది. 1775దాకా బ్రిటన్ ఈ వ్యాపారంలో ఆధిక్యతలో ఉండేది. 1640 – 1807 మధ్య మొత్తం కోటి ఇరవై లక్షలమంది ఆఫ్రికన్ బానిసలని తరలిస్తే వారిలో ముప్పైనాలుగు లక్షలమందిని కేవలం బ్రిటీష్ ఓడలే తరలించాయి.

దాదాపు సగం మంది బానిసలు చెరకుతోటల్లో పనిచేసేవారు. జమైకా చెరకు తోటల్లో, అమెరికాలో మొక్కజొన్న తోటల్లో, ఇంగ్లండ్‌లో ఇళ్ళల్లో సేవకులుగా కూడా వాళ్ళు పనిచేసేవారు. బానిసలని ఛాటెల్ అనేవారు. అంటే వారు వారి యజమానుల ఆస్థి అనర్థం.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి
www.anandbooks.com
www.telugubooks.in

Post your comments